
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం, 29, నవంబర్, 2024



సోమశిలలో 69.798 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 69.79 టీఎంసీల నీరుంది. వివిధ కాలువలకు 8,350 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,560
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ7,125
3 శాతం జీఎస్టీతో	రూ.7,339
సవర (8 గ్రా)	రూ.58,712

గరిష్ఠం/కనిష్ఠం
28.6 /21.4

వాతావరణం

జిల్లాలో చలి పెరిగింది. గాలిలో తేమ 78 శాతంగా నమోదైంది. ఒకట్రెండు చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు శుక్రవారం కురుస్తాయని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ఫీజు గడువును వచ్చే నెల ఐదు వరకు పొడిగించారని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ప్రైవేట్, ఒకేషనల్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోస్టులకు 11లోపు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (టౌన్): గూడూరులోని ఎస్పీఎస్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ - 1, లాంగ్వేజ్ పండిట్ - తెలుగు - 1, హిందీ - 1కు సంబంధించిన నియామకానికి గానూ అర్హులు డిసెంబర్ 11లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల యాజమాన్యం, డీఈఓ కార్యాలయం లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు



కలెక్టర్‌కు వివరాలను తెలియజేస్తున్న డీఎంహెచ్ఓ

నెల్లూరు(అర్బన్): స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేశారని తేలితే చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం అమలుపై కలెక్టరేట్లోని తన చాంబర్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పీసీపీఎన్డీటీ చట్టం మేరకు అల్ట్రా సౌండ్, సీటీ, ఎమ్మారై, ఎకో స్కానింగ్ నిర్వాహకులు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. పరీక్షలు నిర్వహించిన గర్భిణుల వివరాలను ఆన్‌లైన్లో తప్పక నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు చేపట్టాలని చెప్పారు. అనంతరం స్కానింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కమిటీ ఆమోదించింది. డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీఎస్పీ రామారావు, ఎన్జీఓ కవితారెడ్డి, డీఐఓ ఉమామహేశ్వరి, డెమో అధికారి కనకరత్నం పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



భద్రపరుస్తున్న సిబ్బంది

మర్రిపాడు: ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. సింగనపల్లి అటవీ ప్రాంతంలో కుంబింగ్‌ను అటవీ శాఖ అధికారులు నిర్వహించసాగారు. ఈ తరుణంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న పది ఎర్రచందనం దుంగలను తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో డీఆర్వో నాగయ్య, ఎఫ్బీఓ శివకుమారి, బేస్ క్యాంప్ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఆత్మకూరు రేంజ్ అధికారికి సమాచారమిచ్చారు. కాగా దుంగలు లభ్యమవడంతో సింగనపల్లి అటవీ ప్రాంతాన్ని ఫారెస్ట్ అధికారులు జల్లెడపట్టారు. అనంతరం వీటిని ఆత్మకూరు అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు.

ఫెంగల్ అలర్ట్

- నేటి నుంచి వర్షాలు పడే అవకాశం



నెల్లూరు(అర్బన్): ఫెంగల్ తీవ్ర వాయుగుండం ఉత్తరంగా ప్రయాణిస్తూ తమిళనాడులో తీరం దాటే అవకాశం ఉంది. దీని ప్రభావం నెల్లూరు జిల్లాపై ఉండనుందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. ఫెంగల్ కదులుతున్న పరిస్థితిని అంచనా వేసి జిల్లాకు రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు. మరోవైపు సముద్రం అల్లకల్లోలంగా ఉంది. దీంతో మత్స్యకారులను వేటకెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. జిల్లాలో శుక్రవారం నుంచి కొన్ని చోట్ల ఓ మోస్తరు, మరి కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రకటించారు. అధికారులను కలెక్టర్ ఆనంద్ అప్రమత్తం చేశారు. వాయుగుండం ప్రభావం తీవ్రంగా ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సీపీఓ బదిలీ

నెల్లూరు(అర్బన్): జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీఓ) సాలెం రాజును అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. ఆ శాఖ ఏడీ లక్ష్మీనరసింహాన్ని ఇన్‌చార్జి సీపీఓగా నియమించారు.

వ్యూహమా.. సంకేతమా!

నెల్లూరు రూరల్‌లో కోటంరెడ్డి బ్రదర్స్ నయా పాలిట్రిక్స్

- తమ్ముడి రాజకీయ భవిష్యత్తుకు ఎమ్మెల్యే వ్యూహం
- డిసెంబర్ 4 నుంచి గడప గడపకు గిరిధర్‌రెడ్డి
- సర్కార్ ఏర్పాటైన కొద్ది నెలలకే ఈ హడావుడి వెనుక ప్రణాళిక
- మంత్రి పదవి ఆశించి భంగపడ్డ కోటంరెడ్డి రివర్స్ గేర్ ప్లానా..?
- జమిలి ఎన్నికలు వచ్చే అవకాశంతో ముందస్తుకు సిద్ధమా..?
- కార్యక్రమానికి అధిష్టానం అనుమతి లేదంటున్న పార్టీ నేతలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి వచ్చే నెల నుంచి నియోజకవర్గంలో గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. అధికార పార్టీలో ఉన్న గిరిధర్‌రెడ్డికి పార్టీ పరంగా ఎలాంటి పదవులు దక్కలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆర్నెల్లు కూడా గడవలేదు. ఎన్నికలకు ఎంతో గడువున్నా, అప్పుడే ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమానికి గిరిధర్‌రెడ్డి శ్రీకారం చుట్టడం వెనుక రాజకీయ వ్యూహంతో పాటు సంకేతాలూ ఉన్నాయనే అంశం తెలుస్తోంది. అధికార పార్టీ అనుమతి లేకుండానే గిరిధర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించే యత్నంలో గల ఆంతర్యమేమిటనే ఆసక్తికర చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది.


రాజకీయ ఉద్ధండులకు, వ్యూహ ప్రతివ్యూహాలకు పెట్టిన పేరు సింహపురి. అలాంటి జిల్లాలో ప్రస్తుతం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హాట్‌టాపిక్‌గా మారారు. తాజాగా అధికార పక్షంలో ఉంటూ రాజకీయ చర్చకు, రచ్చకు తెరలేపుతున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి ఆర్నెల్లు కాలేదు. అప్పుడే నయా పాలి'ట్రిక్స్'తో ముందుకు ఉరుకుతున్నారు. మంత్రి పదవి ఆశించి భంగపడిన కోటంరెడ్డి భవిష్యత్తు ప్రణాళికలకు సిద్ధమవుతున్నారని కొందరు భావిస్తుంటే.. తన సోదరుడి రాజకీయ భవిష్యత్తుకు లైన్ క్లియర్ చేస్తున్నారని మరికొందరు అంటున్నారు.

తమ్ముడి రాజకీయ భవిష్యత్తు కోసమేనా..?

ఇప్పటి వరకు ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జిగా తెరవెనుక రాజకీయ వ్యవహారాలు నడిపిన గిరిధర్‌రెడ్డి ఇక తెరపైకి రావడం వెనుక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రాజకీయ వ్యూహం ఉందనే ప్రచారం జరుగుతోంది. 'గడప గడపకు గిరిధర్‌రెడ్డి' కార్యక్రమాన్ని డిసెంబర్ 4 నుంచి నిర్వహించేందుకు కోటంరెడ్డే రూపకల్పన చేశారని తెలుస్తోంది. టీడీపీలో కార్యకర్తగా ఉన్న గిరిధర్‌రెడ్డి ఆ పార్టీ అధిష్టాన అనుమతి లేకుండానే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. రాజకీయంగా ఎలాంటి హోదా లేకుండానే ఆయన ప్రజల్లోకి ఎలా వెళ్తారనే ప్రశ్న ఆ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇప్పటి వరకు తన సోదరుడితో కలిసి గిరిధర్‌రెడ్డి అధికార కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎమ్మెల్యే హోదాను అనధికారికంగా అనుభవిస్తున్నారు. ఎమ్మెల్యే తరహాలో అధికార కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం, సమీక్షలు నిర్వహించడం, మంత్రులు నిర్వహించే సమీక్షల్లోనూ పాల్గొంటున్నారు.

జమిలి ఎన్నికల ప్రచార నేపథ్యంలో..

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన సోదరుడ్ని ప్రజల్లోకి తీసుకెళ్లడాన్ని బట్టి జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉందనే సంకేతాలున్నాయని ఆయన అభిమానులు భావిస్తున్నారు. 2026లో నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని, మరుసటి ఏడాదిలోనే జమిలి ఎన్నికలు జరుగుతాయనే ప్రచార నేపథ్యంలో ఇప్పటి నుంచే తానే ఎమ్మెల్యే అభ్యర్థినని చెప్పుకొనేందుకు గిరిధర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని తెలుస్తోంది.



మంత్రి పదవి దక్కలేదనేనా..?

రాజకీయ నాయకులు ఎన్నికలకు ఏడాది ముందు నుంచి హడావుడి చేయడం సహజం. అయితే ఎన్నికలు పూర్తయి ఆర్నెల్లు గడవకముందే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సరికొత్త రాజకీయ వ్యూహానికి తెరతీశారు. వైఎస్సార్‌సీపీ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన మంత్రి పదవిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అది దక్కకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు. టీడీపీలో చేరితే అధికారంలోకి వచ్చాక మంత్రి పదవి ఇస్తామనే హామీతో ఎన్నికలకు ఏడాదిన్నర క్రితం ఆ పార్టీలో చేరి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే కోటంరెడ్డికి తన చిరకాల వాంఛగా ఉన్న మంత్రి పదవి కోసం లోకేశ్ కోటరీ ద్వారా ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. తనను నమ్మించి వంచించారనే మనస్తాపంతో ఉన్న ఎమ్మెల్యే వైరాగ్యంలో కూరుకుపోయారు. జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులతో సాన్నిహిత్యంగా ఉన్నా, ప్రస్తుతం వారితో పొసగడం లేదు. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి ఆయువుపట్టుగా ఉన్న నగర కార్పొరేషన్లో మంత్రి నారాయణ పెత్తనంతో కోటంరెడ్డికి ప్రాధాన్యం తగ్గింది. ఈ పరిణామాలూ ఆయనకు రుచించడం లేదు. వైఎస్సార్‌సీపీలో ఉన్న స్వేచ్ఛా వాతావరణం టీడీపీలో లేకపోవడంతో ఆయన మానసిక సంఘర్షణకు గురవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. భవిష్యత్తులో చేపట్టే మంత్రివర్గ విస్తరణలోనైనా అవకాశం లభిస్తుందనే యత్నంలో భాగంగానే తన సోదరుడితో నయా పాలి'ట్రిక్స్' సాగిస్తున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. అది సాధ్యం కానప్పుడు తన సోదరుడి రాజకీయ భవిష్యత్తుకు మార్గాన్ని సుగమం చేసేందుకు.. ప్రజల్లో పరపతిని పెంచే యత్నం కావొచ్చని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు.

అధిష్టానం అనుమతి లేకున్నా..

కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కుదురుకోలేదు. ఎన్నికల హామీలను నెరవేర్చలేక ప్రజాగ్రహానికి గురవుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి తన సోదరుడ్ని ప్రజల్లోకి పంపే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రతినిధిగా వ్యవహరిస్తున్న గిరిధర్‌రెడ్డి ఈ సమయంలో ప్రజల్లోకి వెళ్తే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని వారి నుంచి వ్యతిరేకత ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ పరిణామాలు రాష్ట్రం మొత్తంలో చర్చకు దారి తీసే అవకాశం ఉంది. ఒకవేళ ఇదే జరిగితే కూటమి ప్రభుత్వానికి గడ్డు పరిస్థితులు ఎదురుకానున్నాయి. ఈ పరిస్థితుల్లో గిరిధర్‌రెడ్డి కార్యక్రమానికి అనుమతి ఇచ్చే సాహసాన్ని పార్టీ అధిష్టానం చేయకపోవచ్చు. పార్టీ అనుమతి చ్చినా.. ఇవ్వకపోయినా.. గిరిధర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి సిద్ధమైతే పరిస్థితులు, పరిణామాలు ఒక్కసారిగా మారే అవకాశం ఉంది.

గ్రామానికి రోడ్డు వేయండి మహాప్రభో

- విద్యార్థుల వేడుకోలు
- మోకాళ్లపై నడుస్తూ నిరసన



మోకాళ్లపై నడుస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆత్మకూరు: పాఠశాలకు వెళ్లాలంటే నిత్యం తంటాలు పడాల్సి వస్తోందని, తమ గ్రామానికి రోడ్డు వేయాలని విద్యార్థులు కోరారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో మోకాళ్లపై నడుస్తూ నిరసనను గురువారం చేపట్టారు. వివరాలు.. ఆత్మకూరు మండలంలోని మహిమలూరు పంచాయతీ మజరా కోటపాడుకు వెళ్లే రెండున్నర కిలోమీటర్ల రోడ్డు దుర్భరంగా మారింది. గ్రామం నుంచి సుమారు 20 మంది విద్యార్థులు మహిమలూరు పాఠశాలకు నిత్యం వెళ్తుంటారు. సాధారణ రోజుల్లో దారి వెంట వెళ్లే ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలను ప్రాధేయపడి పాఠశాలకు వెళ్తారు. అయితే వర్షాకాలంలో ఆటోలు సైతం గ్రామంలోకి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ మట్టి రోడ్డులో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తమ గ్రామానికి రోడ్డు వేయాలని ఉన్నతాధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో, విసిగిపోయి మట్టి రోడ్డుపై మోకాళ్లపై నడిచి నిరసన తెలియజేశారు. కాగా అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లాలంటే రోగిని భుజాలపై మోసుకెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లేని రహదారులను నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం చెప్తోందని, తమ గ్రామంలోని రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు.

పంచాయతీరాజ్ ఏఈకి షోకాజ్ నోటీసులు

ఉదయగిరి: ఉదయగిరి పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజుకు షోకాజ్ నోటీసులను జిల్లా అధికారులు గురువారం జారీ చేశారు. మండలంలో అభివృద్ధి పనులకు సహకరించకుండా, ప్రతి పనికీ పర్సంటేజీలను ముందే డిమాండ్ చేస్తున్నారంటూ కలెక్టర్ ఆనంద్‌కు స్థానిక వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్య ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారణకు ఆదేశించారు. విధి నిర్వహణలో ఏఈ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అంశాన్ని జిల్లా పంచాయతీరాజ్ అధికారులు గుర్తించారు. మండలంలో ఆయన పరిధిలో ఉన్న ఐదు పంచాయతీలను తప్పించి వింజమూరు ఏఈకి అదనపు బాధ్యతలను అప్పగించారు. దీనిపై పది రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు చేపడతామని షోకాజ్ నోటీసుల్లో పేర్కొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న కాకాణి, పక్కన విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే చొరవతోనే మహిళల జీవితాల్లో వెలుగులొచ్చాయని, ఆయన సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని డైకస్ రోడ్డులో గల తన క్యాంప్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి నివాళులర్పించిన అనంతరం కాకాణి మాట్లాడారు. పూలే స్ఫూర్తితో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యం, మహిళా సాధికారతకు ఎనలేని ప్రాధాన్యమిచ్చారని తెలిపారు.

చిరుద్యోగులపై పచ్చపాతం

- విధుల నుంచి మధ్యాహ్న భోజన సహాయకురాలి తొలగింపు



సుబ్బరత్నమ్మనే కొనసాగించాలంటూ హెచ్‌ఎంకు విన్నవిస్తున్న తల్లిదండ్రులు

కొడవలూరు: అధికారం తమదేననే ధీమాతో టీడీపీ నేతలు చెలరేగిపోతున్నారు. చిరుద్యోగులపై సైతం తమ ప్రతాపం చూపుతూ వారి కడుపు కొడుతున్నారు. తాజాగా మండలంలోని గండవరం ప్రధాన ప్రాథమిక పాఠశాలలో ఈ తరహా వేధింపులు వెలుగులోకి వచ్చాయి. ఈ పాఠశాలలో 8 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తున్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం కోసం నిర్వాహకురాలు, సహాయకురాలున్నారు. అయితే సహాయకురాలు సుబ్బరత్నమ్మను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో నియమించారనే ఆక్రోశంతో ఆమెను విధుల నుంచి అకారణంగా తొలగించారు. ఆమె స్థానంలో అధికార పార్టీకి చెందిన ఒక మహిళను నియమించేందుకు రంగం సిద్ధం చేశారు. వాస్తవానికి నిబంధనల మేరకు వీరి నియామకాన్నీ పాఠశాల పేరెంట్స్ కమిటీ చేపట్టాలి. సుబ్బరత్నమ్మను తొలగించేందుకు గానూ ఈ కమిటీపై సైతం స్థానిక టీడీపీ నేతలు ఒత్తిడి తెచ్చారు. కాగా పిల్లలను సుబ్బరత్నమ్మ ఎంతో బాగా చూసుకునేవారని, బుజ్జగించి మరీ భోజనాన్ని తినిపించేవారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఈ మేరకు హెచ్‌ఎం మధుసూదన్‌కు వినతిపత్రాన్ని గురువారం వారు అందజేశారు. కాగా ఈ అంశమై ఎంఈఓ వసంతకుమారిని సంప్రదించగా, పాఠశాల పేరెంట్స్ కమిటీదే తుది నిర్ణయమని, దీని ప్రకారమే తొలగింపు, ఎంపికలు జరుగుతాయని బదులిచ్చారు.

కావలి గొర్రెల సంతకు 100 YEARS చరిత్ర

ఇప్పుడంటే పట్టణాలు, గ్రామాల్లో ఇబ్బడి ముబ్బడిగా మాంసం దుకాణాలు వెలిశాయి గానీ పాత రోజుల్లో మాంసం సేకరణ అనేది ఒక ఈవెంట్‌లా ఉండేది. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. గ్రామదేవత తిరునాళ్లు, పండగలు, శుభకార్యాలు... ఇలా సందర్భమేదైనా ఎంత మాంసం అవసరమవుతుందో నిర్దిష్టమైన అంచనాకు వచ్చి ఆ మేరకు సేకరించేవారు. వారాంతపు సంతకు వెళ్లి మేకలు, గొర్రెలను కొనుగోలు చేసి మాంసాన్ని సిద్ధం చేసుకొని ఎవరికి ఎంత అనేది భాగాలు పెట్టుకొని పంచుకునేవారు. – కావలి





సంతలో అమ్మకానికి సిద్ధంగా జీవాలు



సంతలో జీవాల క్రయవిక్రయాలు

- వారంలో ఒక్క శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకే సంత ఉంటుంది.

ఐదు నెలలు ఆపై వయస్సున్న గొర్రెలు, మేకలను సంతకు పెంపకందారులు తీసుకొస్తారు. వాటి ధరలు రూ.ఐదు వేల నుంచి రూ.15 వేల వరకు ఉంటాయి.

- అలా వందేళ్ల క్రితమే కావలి పట్టణంలో గొర్రెలు, మేకలు సంత ఉండేది. ప్రస్తుతం కావలి పట్టణానికి మాతృక పాతూరు. అంటే నేటి పాతూరుగా ప్రాచుర్యంలో ఉన్న ప్రాంతమే నాడు కావలి పట్టణం.
- పాతూరుకు దూరంగా రైలు ట్రాక్‌కు ఆనుకొని గ్రామ దేవత కళుగోళమ్మ శాంభవి ఆలయం ఉంది. ఆ రోజుల్లో అమ్మవారికి పొంగళ్లు, మొక్కులు, తిరునాళ్లు, ఉత్సవాలు తదితరాలను పెద్ద ఎత్తున నిర్వహించేవారు.
- ఆ సందర్భాల్లో గొర్రెలు, మేకల మాంసంతో బంధుమిత్రులకు విందు భోజనాలిచ్చేవారు. ఈ క్రమంలోనే గ్రామ దేవత ఆలయానికి పాతూరుకు మధ్యలో గొర్రెలు, మేకల అమ్మకాలు జరిపే సంత ఏర్పడింది. ఇది ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.
- కావలి పట్టణం విస్తరించినా సంత ఉన్న ప్రాంతాన్ని పెద్దపవని బస్టాండ్, కొలిమి బజార్‌గా స్థానికులు పిలుస్తుంటారు. అక్కడే కొలిమి పనులు చేసే వారు కూడా ఉంటారు.
- ప్రజల ఆహార అలవాట్లలో చాలా మార్పులొచ్చాయి. ఒకప్పుడు ఏదైనా శుభకార్యం ఉంటేనే మాంసం తెచ్చుకునేవారు. ప్రస్తుతం వినియోగం పెరిగింది. వారానికి తక్కువలో తక్కువ రెండు, మూడు సార్లయినా ముక్క లేనిదే ముద్ద దిగడం లేదు.
- గొర్రె, మేక మాంసానికి డిమాండ్ పెరగడంతో కిలో రూ.900 నుంచి రూ.వెయ్యికి ఎగబాకింది.

పొంగళ్ల కోసం..




మా కుటుంబ సభ్యులం పొంగళ్లు పెట్టుకుంటున్నాం. అందుకు అవసరమైన విందు భోజనానికి మాంసం అవసరం. అందుకే సంతకు వచ్చి రూ.పది వేలు పెట్టి మేకపోతును కొన్నా.
– రమణయ్య, ఆముదాలదిన్నె, కావలి మండలం

చాలా కాలం నుంచి వస్తున్నా..



నా పేరు పోలయ్య. మాది గుడ్లూరు మండలం అమ్మవారిపాళెం. నాకు 68 సంవత్సరాలు. చాలా ఏళ్ల నుంచి కావలి సంతకు జీవాలు తెచ్చి అమ్ముతుంటా. నా తరం, నా పిల్లల తరం అయిపోయి నా మనవళ్ల తరం నడుస్తోంది. అయినా మా కుటుంబం జీవాలు పెంచే వృత్తిని కొనసాగిస్తూనే ఉంది.



కడలి కల్లోలం

ఫెంగల్ నేపథ్యంలో కడలి కల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. ప్రతికూల వాతావరణంతో మైపాడు బీచ్‌కు పర్యాటకుల రాక తగ్గుముఖం పట్టింది. మత్స్యకారులు తమ వేట సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- ఇందుకూరుపేట

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

• రూ.6 లక్షల స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ రవినాయక్, ఎస్సైలు విశ్వనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి

ముత్తుకూరు: మండలంలోని పిడతాపోలూరు పంచాయతీలోని కట్టకింద వడ్డిపాళెంలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవినాయక్, ఎస్సై విశ్వనాథరెడ్డి, కృష్ణపట్నం ఎస్సై శ్రీనివాసరెడ్డిలు గురువారం వివరాలు వెల్లడించారు. కట్టకింద వడ్డిపాళేనికి చెందిన నెల్లూరు పద్మ ఇంట్లో ఐదురోజుల క్రితం రూ.6 లక్షల నగదు చోరీ జరిగింది. ఎస్పీ, రూరల్ డీఎస్పీ ఆదేశాల మేరకు కృష్ణపట్నం సీఐ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి కేసును ఛేదించారు. పిడతాపోలూరు క్రాస్‌రోడ్డు వద్ద నిందితుడు నెల్లూరు వెంకటరమణయ్యను పట్టుకున్నారు. చోరీ సొత్తు రూ.6 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

అక్కున చేర్చుకుని.. అండగా నిలిచి..



యువతి


కావలి: మతిస్థితిమితం కోల్పోయి కావలి రోడ్లపై తిరుగుతున్న ఓ యువతిని కడపకు చెందిన మనోబంధు ఫౌండేషన్ వారు అక్కున చేర్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఎక్కడి నుండో ఇటీవల కావలికి వచ్చిన సుమారు 20 సంవత్సరాల వయసున్న ఓ యువతి రోడ్డుపై తిరుగుతుండగా ఆర్టీసీ సిబ్బంది, అరుంధతీయపాళెం వాసులు ఆహారం, దుస్తులు సమకూర్చారు. అయితే ఆమె ప్రజలు, ప్రయాణికులపై దాడులు చేస్తుండడంతో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్ ఈ విషయాన్ని కడపకు చెందిన మనోబంధు ఫౌండేషన్ నిర్వాహకుడు శివారెడ్డికి సమాచారం అందించారు. ఆయన తమ రెస్క్యూ అంబులెన్స్‌ను కావలికి పంపించగా సామాజిక కార్యకర్త దావులూరి క్రాంతికుమార్ సహకారంతో బుధవారం రాత్రి యువతిని కడపకు తరలించారు. ఈ క్రమంలో ఆమె క్రాంతికుమార్‌ను, అరుంధతీయపాళెం యువకులను స్వల్పంగా గాయపరిచింది. కాగా యువతిని ఫౌండేషన్ ఆశ్రమంలో చేర్చి చికిత్సను ప్రారంభించారు.

తహసీల్దార్ల నియామకం

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న మూడు మండలాలకు తహసీల్దార్లను నియమిస్తూ కలెక్టర్ ఆనంద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాపూరు తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డీటీగా పనిచేస్తున్న పి.కృష్ణ దగదర్తి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. అలాగే టీజీపీ స్పెషల్ డిప్యూటీ కార్యాలయంలోనే మరో స్పెషల్ డీటీగా పనిచేస్తున్న వై.సుభాషిణిని అనంతసాగరం మండల తహసీల్దార్‌గా, ఇందుకూరుపేట మండల డీటీగా పనిచేస్తున్న బి.మురళీని చేజర్ల తహసీల్దార్‌గా నియమించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.35
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.15





ధనలక్ష్మీపురంలో ఇలా..



లైట్లు వేసుకుని వెళ్లాల్సిందే..

మంచు దుప్పటి

జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగింది. కొద్దిరోజులుగా పొగమంచు కమ్మేస్తోంది. దీనికితోడు ప్రస్తుతం వర్షాల ప్రభావంతో ఆకాశం మేఘావృతమైంది. దట్టమైన మంచుతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

తూకాల్లో మోసాలపై కేసుల నమోదు



వ్యత్యాసాలను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలోని చేపలు, చికెన్ విక్రయ దుకాణాలపై గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు కొలతలు, కార్పొరేషన్ శానిటరీ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. పది దుకాణాల్లో తూకాల్లో 100 గ్రాములకు పైగా వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. అపరిశుభ్ర వాతావరణంతో ఉన్న ఓ చికెన్ స్టాల్‌కు రూ.15 వేలు, మరో దుకాణానికి రూ.5 వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ దాడుల్లో తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ రియాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి, విజిలెన్స్ ఏఈ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు పెట్టొద్దు



గండిపాళెంలో ఆందోళన చేస్తున్న మహిళలు



నెల్లూరులో ధర్నాలో పాల్గొన్న సీపీఐ నాయకులు

ఉదయగిరి: ఉదయగిరి మండలం గండిపాళెంలో మద్యం దుకాణం ఏర్పాటు యత్నాన్ని నిరసిస్తూ బస్టాండ్ సెంటర్‌లో గ్రామస్తులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఘర్షణలు తలెత్తే అవకాశం ఉన్నందున వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉదయగిరి, వరికుంటపాడు మండలాల గ్రామాలకు అనువుగా గండిపాళెం ఉండటంతో ఉదయగిరికి చెందిన మద్యం వ్యాపారులు ఇక్కడ దుకాణం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని తెలిపారు. ఇప్పటికే ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం కూడా ఇచ్చామని తెలిపారు. అయినా మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండటంతో ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పరమేశ్వరి నగర్‌లో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు నగరంలోని వాకర్స్‌రోడ్డులో పరమేశ్వరి నగర్‌లో ఏర్పాటు చేసిన లక్కీ బ్రాందీ షాపును వెంటనే తొలగించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్ డిమాండ్ చేశారు. మద్యం దుకాణాన్ని తొలగించాలని 24 రోజులుగా స్థానికులు, మహిళలు చేస్తున్న ధర్నాకు గురువారం సీపీఐ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం జనావాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేలా లైసెన్స్ ఇవ్వడం దారుణమన్నారు. మహిళల ఆందోళనను గుర్తించి అధికారులు మద్యం దుకాణాన్ని తీసివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు షాన్‌వాజ్, మున్నా, అజీజ్ అహ్మద్, లతీఫ్, రఫీ, సందానీ పాల్గొన్నారు.

మేకల కాపరి దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్సై

కొండాపురం: మండలంలోని గానుగపెంట సామాజిక అటవీ ప్రాంతంలో మేకల కాపరి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. కొండాపురం ఎస్సై ఎం.వెంకట్రావు, స్థానికుల కథనం మేరకు.. గానుగపెంట గ్రామానికి చెందిన బంకా తిరుపాలు (55) బుధవారం ఉదయం తన 20 మేకలను మేత కోసం అడవికి తోలుకెళ్లాడు. అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెంది రాత్రి కొండాపురం పోలీసులు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం అడవిలో వెళ్తున్న కొందరు తిరుపాలు మృతదేహాన్ని చూసి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కావలి డీఎస్పీ శ్రీధర్, కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్సై,లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సంగం మండలం తురిమెర్ల గ్రామానికి చెందిన గురునాథం మాల్యాద్రి అనే వ్యక్తి రెండు నెలలుగా గానుగపెంటలో గ్రామస్తుల పశువులు కాస్తున్నాడు. ఈ క్రమంలో తిరుపాలు, మాల్యాద్రికి స్నేహం ఏర్పడింది. కలిగిరి మండలం చిన్నఅన్నలూరు వద్ద బుధవారం సాయంత్రం మాల్యాద్రి తక్కువ రేటుకే మేకలను విక్రయిస్తున్నాడని కొందరు వీడియో తీసి తువ్వరవారిపాళెం గ్రామస్తులకు పంపారు. గురువారం ఉదయం తిరుపాలు హత్య విషయం వెలుగులోకి రావడంతో మాల్యాద్రినే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని మృతుడి బంధువులు అనుమానిస్తున్నారు. మాల్యాద్రిని పట్టుకునేందుకు వెళ్లగా అప్పటికే పరారయ్యాడు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

రైతులు బీమా పథకంలో చేరాలి

• కలెక్టర్ ఆనంద్



బీమా పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో పంటలు సాగు చేస్తున్న రైతులు బీమా పథకంలో చేరాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. పంటల బీమా పథకంపై జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ మొదటి సమావేశాన్ని కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత బీమా పథకాల్లో రైతులు చేరేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో వరి, మినుములు, శనగలు, పెసర, వేరుశనగ తదితర పంటలకు ప్రీమియం సైతం తక్కువేనని చెప్పారు. పంట రుణాలు తీసుకునే రైతులకు సంబంధిత బ్యాంక్ ప్రీమియం మొత్తాన్ని మినహాయించి బీమా కంపెనీకి చెల్లిస్తారని వివరించారు. వరికి సంబంధించి డిసెంబర్ 31.. మిగిలిన పంటలకు తుది గడువును డిసెంబర్ 15న నిర్దేశించారన్నారు. అనంతరం పంటల బీమా పత్రం పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, సీపీఓ రాజు, ఇరిగేషన్ ఎస్‌ఈ దేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దత్తత ప్రక్రియలో జాప్యం వద్దు

అనాథ పిల్లలను దత్తత ఇచ్చే ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. నెల్లూరులోని తన కార్యాలయంలో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనాథ బాలల వసతి గృహాలు జేజే యాక్ట్ 2015 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలన్నారు. ఆధార్‌కార్డులు లేని వారికి విద్యాశాఖ, ఐటీడీఏ సహకారంతో ఇప్పించాలన్నారు. భిక్షాటన చేసే కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి పిల్లలను బడుల్లో చేర్పించాలని సూచించారు. ఫ్యాక్టరీల్లో పిల్లలు పనిచేస్తుంటే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ బి.హేనాసుజన్, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, డీఎస్పీ రామారావు, కార్మిక శాఖ డీసీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌పై డీసీహెచ్‌ఎస్ విచారణ



డాక్టర్లతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఓ మహిళకు జరిగిన కంటి ఆపరేషన్‌పై అధికారులు విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. అనంతసాగరం మండలం గౌరవరం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే మహిళకు ఇటీవల కంటి ఆపరేషన్ చేశారు. మరుసటిరోజు ఇంటికెళ్లాక ఆమెకు కన్నుకు ఇన్ఫెక్షన్ సోకినట్లు రావడంతో వెంటనే ఆస్పత్రికి వచ్చింది. అక్కడి డాక్టర్లు పరీక్షించి తొలుత నెల్లూరుకు, అనంతరం తిరుపతి అరవింద నేత్రాలయానికి తరలించారు. ప్రస్తుతం మెరుగైన వైద్యం జరుగుతోంది. అయితే ఈ విషయమై ఫిర్యాదు అందడంతో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్ గురువారం సాయంత్రం ప్రభుత్వాస్పత్రికి చేరుకుని ఆర్ఎంఓ డాక్టర్ ఉషాసుందరి, కంటి వైద్యురాలు శ్రావణి, ఇతర డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. తిరుపతి వైద్యాధికారులను లక్ష్మమ్మ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజుల్లో ఆమెను డిశ్చార్జి చేయనున్నట్లు తెలిపారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు డీసీహెచ్‌ఎస్ తెలిపారు.

వినియోగదారులకు గుదిబండ

జిల్లాలో గ్యాస్‌పై బాదుడు

- సిలిండర్‌పై రూ.50 అదనం
- ప్రతి నెలా రూ.కోట్లల్లో వసూళ్లు
- పట్టించుకోని అధికారులు

జిల్లాలో గ్యాస్ సిలిండర్ పేరిట బాదుతూ వినియోగదారుల జేబులకు కొందరు చిల్లులు పెడుతున్నారు. సిలిండర్‌పై అదనంగా రూ.50 మేర వసూలు చేస్తున్నారు. ఈ అంశమై ప్రశ్నించినా.. ఫిర్యాదు చేసినా సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ఈ విషయమై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.



నెల్లూరు (పొగతోట): గ్యాస్ వినియోగదారులు ప్రతి నెలా రూ.కోట్లల్లో నష్టపోతున్నారు. సిలిండర్‌పై అదనంగా రూ.50 మేర వసూలు చేస్తూ భారీగా దండుకుంటున్నారు. జిల్లాలో ఎనిమిది లక్షలకుపైగా వినియోగదారులు, 30కుపైగా గ్యాస్ ఏజెన్సీలున్నాయి. నిత్యం 15 వేల నుంచి 20 వేల వరకు సిలిండర్లను సరఫరా చేస్తున్నారు. ఈ రకంగా రోజూ రూ.7.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అక్రమ మార్గంలో వసూలు చేస్తున్నారు. ఈ వ్యవహారం నిత్యం జరుగుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదు. వినియోగదారులు ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతామంటూ చేతులు దులుపుకొంటున్నారు. ఒకవేళ ఫిర్యాదు చేస్తే సిలిండర్లను సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. నిబంధనల మేరకు గ్యాస్ ఏజెన్సీ నుంచి దూరాన్ని బట్టి నగదును వసూలు చేయాల్సి ఉంది. ఐదు కిలోమీటర్లలోపు ఎమ్మార్పీకే సిలిండర్‌ను సరఫరా చేయాలి. అయితే డెలివరీ బాయ్స్ ఇవేవీ పట్టించుకోకుండా వినియోగదారుల నుంచి రూ.50 మేర అదనంగా వసూలు చేస్తున్నారు.

సిలిండర్లు పక్కదారి

సిలిండర్లను బుక్ చేసిన ఐదురోజుల నుంచి వారంలోపు సరఫరా చేయాల్సి ఉంది. అయితే నగరంలో ఇది సక్రమంగా అమలు కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గృహావసరాలకు వినియోగించే సిలిండర్లను హోటళ్లకు డెలివరీ బాయ్స్ విక్రయిస్తున్నారని సమాచారం. ఈ తరహాలో సిలిండర్లను బహిరంగ మార్కెట్లో రూ.1,300 నుంచి రూ.1,500 వరకు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. నెల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో బ్లాక్ మార్కెట్ అధికంగా ఉంది.

తూకాల్లోనూ తేడాలే..

గృహావసరాలకు వినియోగించే సిలిండర్ల తూకంలోనూ తేడాలుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిలిండర్లను ఆటోల్లో దూర ప్రాంతాలకు తీసుకెళ్లి రెండు నుంచి మూడు కిలోల మేర ఇతర సిలిండర్లలో నింపి సరఫరా చేస్తున్నారు. నగరంలోని మూడో మైలు, అల్లీపురం, పడారుపల్లి, బుచ్చిరెడ్డిపాళెం ప్రాంతాల్లో ఈ ప్రక్రియ జోరుగా సాగుతోంది. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటాం

అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపడతాం. ఎమ్మార్పీకే సిలిండర్లను విక్రయించాలి. అధికంగా వసూలు చేస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తప్పవు. దీనిపై వినియోగదారులు ఫిర్యాదు చేయాలి. గృహావసరాలకు వినియోగించే సిలిండర్లను ఇతర అవసరాలకు వాడితే చర్యలు చేపడతాం.

– వెంకటరమణ, డీఎస్‌ఓ

సాక్షి క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్ పోయినది
H.No.82, పెరుమాళ్ ముదాలి వీధి, చెన్నై, [illegible] కి సంబంధించిన [illegible] తీసుకొని ప్రస్తుతం ఉంటున్న బోగోలు నుండి కావలికి పోవుచుండగా మార్గమధ్యములో పడిపోయినది. అవి దొరికిన వారు క్రింది సెల్ నెంబరుకు సంప్రదించగలరు. 91765 99954

AUTOMOBILES

VEHICLE FOR SALE
■ 1) AP26 TA2979-Tata Motors-LPT 3118 TCBSIII-Tipper-2013, 2) AP31 TH0033 - Tata Motors-LPT 3718 TC 10x2 TRCHWCL ULW 9595 BSIII-Lorry-2013. As it is Conditions.Cont:T.J.Financial Consultancy & Investments Private Limited, No.9, K.R. Koil Street,1st Floor,West Mambalam, Chennai-600033,Ph:044-24749252, 9701260666. [T-3777]

EDUCATION

DIRECT FINAL YEAR
■ 10th / Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA. MBA, MLIS, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D, BNYS, BPT. Cont: 9030030125 [T-2407]

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629 [T-2409]

REAL ESTATE

FLAT FOR SALE
■Ready to occupy 2 BHK and 3 BHK premium Flats, Rs. 3000/- Sq. ft. Rao's Pharmacy College Road, close to National Highway. Call: 94407 30945, 70423 64999. [NA-11173]

■RTC బస్టాండ్ దగ్గర, అరవిందనగర్, స్ప్రింగ్ నెస్ట్ అపార్ట్‌మెంట్‌లో 1650 చ॥అ॥ల, లాస్ట్ ఒక 3 BHK FLAT అమ్మకానికి కలదు.ఫోన్ : 96770 10777 [V- 2722]

PLOT FOR SALE
■నిప్పో ఫ్యాక్టరీ మెయిన్ గేట్ ఎదురుగా చంద్రమౌళి నగర్ 2వ వీధిలో21 అంకణముల స్థలములో ఉన్న రేకుల ఇల్లుతో సహా అమ్మకానికి కలదు. ఫోన్ : 96770 10777 [V- 2723]

SERVICES

GOLD FINANCE
■బ్యాంకులలో, వివిధ తాకట్టు సంస్థలలో ఉన్న బంగారం వేలం సమయానికి విడిపించి మార్కెట్ ధర ప్రకారం స్పాట్ క్యాష్ ఇవ్వబడును. బెస్ట్‌మనీ గోల్డ్. వివరములకు సంప్రదించండి: 9150011538, 9150061325. [N-1256693]

CHANGE OF NAME
I, NELAVAI GIRI PRASAD (Old Name), Resident of Madaraju Guduru, Kakupalle-2, Nellore Rural, SPSR Nellore Dt, AP. here by declare that I have changed my name as NELAVAI GIRI PRASAD REDDY (New Name) S/o. NELAVAI CHANDRA REDDY.

TOURS & TRAVELS
■అలహాబాద్ (కుంభమేళ) కాశీ, చిత్రకూటం, అయోధ్య, నైమిశారణ్యం, గయ 8.2.25తేదీ 9రో॥ టికెట్ 18000/- రైలు (ACబస్సు + AC రూం) K.వాసు. నెల్లూరు. వివరములకు సంప్రదించండి: 94913 40504. [NA-23886]

WANTED
■Wanted math Teacher & Computer Operator Proficient in MS-Office.Contact: Nalanda Olympiad School, Near: Manasa Theatre, Kavali. Ph: 99498 49758. [N-1237140]

■Wanted Female Tally Accountant (Freshers also) for Chanukya Enteреprises (Distribution). Further Details Cont: 97019 55118, 92464 31118. [NA-23890]

■WANTED : Office Assistants, Coordinators(Female), Skills : MS.Office, Good Communication. Qulif : B.Tech, MCA, MBA, M.Sc & Degree. Contact: 89858 38512, 81798 98924. [N-1256466]

■ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. సం:8121818692 [G-9087]

■కావలి నలంద E.M స్కూలు నందు పని చేయుటకు 6th to 10th ఫిజిక్స్, P.E.T టీచర్లు కావలెను. నాన్ లోకల్స్‌కు ఉచిత భోజన వసతి కలదు. సంప్ర: 99894 33348, 91210 24992. [N-1237138]

■నెల్లూరు బోసుబొమ్మ దగ్గర గల RKT పెట్రోలు బంకులో పని చేయుటకు యువతి యువకులు కావలెను. జీతం: 15,000. వివరములకు సంప్రదించండి.95501 89885. [NA-6710]

■మా సెక్యూరిటీ సంస్థ వేదాయపాళెంలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12గంటలు డ్యూటీ.వివరములకు సంప్రదించండి: 93928 41678, 89850 11766. [NA-11184]

■మల్టీనేషనల్ కంపెనీలో Good Opportunity యువతి యువకులకు,గృహిణులకు, నిరుద్యోగులకు, రిటైర్డ్ పర్సన్స్‌లకు సువర్ణావకాశం. పార్ట్ టైం/ఫుల్ టైం. సంప్రదించండి. 7207494751. [NA-23868]

■ప్రముఖకంపెనీకి(M/F) పార్ట్/ఫుల్ టైం మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. హౌస్ వైఫ్స్, LIC ఏజెంట్స్, సీనియర్ మేనేజర్స్, టీమ్ లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్ కావలెను ఫ్రెషర్స్ కూడా సంప్ర॥ 8977624599 [G-294]

■ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. 9380269951 [G-9090]

CHANGE OF NAME
I, ASHFAQ ALI (Given Name) and Mohammed (Surname) Son of Mohammed Khader Ali resident of D. No. 22-150, Dadi Vari Street, Pedda Bazar, Nellore Andhra Pradesh, holding Passport No. S3855136 issued at Riyadh on 21-03-2018 hereby announce to change my name as ASHFAQ ALI (Given Name) MOHAMMED (Surname) for all future purposes.

■మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801. [M-1185432]

■ప్రముఖ ఎడ్యుకేషనల్ సమస్త తరుపున పని చేయుటకు ఫీల్డ్ అనుభవం కలిగిన మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. ✆ 9030030125 [T-2406]

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ : 18K. Ph: 9160900024, 9640400073 [HA-1385]

■కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 9182260297 [HA-99132]

■AP& తెలంగాణలోని అన్ని జిల్లాలు మండలాల నందు యువరాజ్ ఎంటర్ ప్రైజెస్ & ఫైనాన్స్ నందు జాబ్ చేయుటకు మేనేజర్స్ -30, SM-150, ASM-150, రిసెప్షనిస్టులు –120 కావలెను. జీ॥ 15k+15k, 10k, & 7k. సంప్ర॥ ✆ 90149 14193, 91002 90236. [O-793941]

■నెల్లూరులోని ప్రముఖ మాల్‌లో పని చేయుటకు అసిస్టెంట్ ఫైర్ & సేఫ్టీ. Qlf: డిప్లమా (ఫైర్ & సేఫ్టీ). సెక్యూరిటీ సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డ్స్ Hight : 5'8"(పురుషులు), 5'4" (స్త్రీలు) మరియు హౌస్ కీపింగ్ / క్లీనింగ్ హెల్పర్స్ కావలెను. మంచి జీతం, PF, ESI, గ్రాట్యూటీ, వార్షిక బోనస్ ఇవ్వబడును. వివరములకు సంప్రదించండి:7794999364, 7780736896. [NA-724]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.